క్లుప్తంగా

ప్రత్యేక ఓటర్ల నమోదును సద్వినియోగం చేసుకోండి

• తహసీల్దార్ సురేష్

చీపురుపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం .సురేష్ కోరారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ... డిసెంబర్ 2,3 తేదీల్లో అన్ని పోలింగ్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆ రోజుల్లో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల కోసం బీఎల్‌ఓలను సంప్రదించాలని కోరారు.

విశాఖ వెళ్లి పింఛన్ అందజేత

దత్తిరాజేరు: మండలంలోని గడసాం గ్రామానికి చెందిన వలంటీర్ పైడిరాజు విశాఖ వెళ్లి మరీ పింఛన్ అందజేశాడు. యడ్ల అప్పన్న అనే వృద్ధుడు కొద్ది రోజులుగా విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ శుక్రవారం విశాఖలోని కేజీహెచ్‌కు వెళ్లి పింఛన్ సొమ్ము అందించాడు. దీంతో వృద్ధుడి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులకు మరువాడ గ్రామానికి చెందిన వెన్నెల పూర్ణచంద్రశేఖర్ సమకూర్చిన నిత్యావసర సరుకులు, వంట పాత్రలు, దుస్తులను ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు రాపాక సూర్యప్రకాశరావు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు టి.సత్తిబాబు, గొల్లు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు బహుమతులు

శృంగవరపుకోట: ఆర్టీసీ పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి బహుమతులు అందజేస్తున్నట్లు స్థానిక డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. ఎస్.కోట డిపో పరిధిలో నవంబర్ 16వ తేదీ నుంచి 30 వరకు జామి - విజయనగరం, తాటిపూడి - విజయనగరం, కొట్యాడ - విజయగనరం, గుమ్మకోట - ఎస్.కోట రూట్‌ల మధ్య ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారికి శుక్రవారం స్థానిక డిపో ఆవరణలో లక్కీడిప్ తీశారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన భవాని(గుమ్మకోట), ఆర్‌వీ ప్రణీత (జామి), జి.తేజేశ్వరరావు (తాటిపూడి), ఎస్.సత్యం (కోట్యాడ)లకు బహుమతులు అందజేశారు. అలాగే ఈ నెల 3వ తేదీ నుంచి 10 వరకు పంచరామాలలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి

• డీఆర్‌డీఏ పీడీ ఏకే చక్రవర్తి

చీపురుపల్లిరూరల్ (గరివిడి): మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీఏ పీడీ ఏకే చక్రవర్తి ఆకాంక్షించారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలు, వీఓఏలతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మహిళా సంఘాల సభ్యులందరూ జీవనోపాధిని మెరుగుపరుచుకునేలా వారిని చైతన్య పరచాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రి, ఏరియా కోఆర్డినేటర్ బి.బంగారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై అవగాహన

లక్కవరపుకోట: ఏపీ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకం ఆధ్వర్యంలో ఉద్యానవన శాఖ సౌజన్యంతో పండ్ల తోటల పెంపకం, యాజమాన్య పద్ధతులపై మండలంలోని కొట్యాడలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ, మామిడి తోటల్లో ఎరువుల యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణ, పూత, పిందె సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే ఆధునిక పద్ధతిలో కూరగాయాల సాగుపై అధ్యాపకుడు బీవీకే ప్రసాద్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి పద్మ, కొత్తవలస మార్కెటింగ్ కమిటీ సభ్యుడు కొట్యాడ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొట్యాడ మహేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది నిరసన

శృంగవరపుకోట: దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎస్‌టీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్లు పట్టణంలోని ప్రకాశం మార్కెట్ వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా యూనియన్ల ప్రతినిధులు మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 8వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో సమ్మె చేపడతామన్నారు. కార్యక్రమంలో యూనియన్ల ప్రతినిధులు డి.శ్యామలాకుమారి, డి.జయలక్ష్మి, కె.దంతేశ్వరి, వి.మాణిక్యం, డి.సుశీల, ఎస్.కనకమహాలక్ష్మిలతో పాటు పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్నతోనే సుపరిపాలన..


బొండపల్లి: అంబటివలసలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న ఎంపీపీ చలంనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు సూర్యప్రకాశరావు, చిన్నంనాయుడు, తదితరులు


మెరకముడిదాం: సిరిదేవిపురంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు కోట్ల విశ్వేశ్వరరావు, కేఎస్‌ఆర్‌కే ప్రసాద్, తదితరులు


గుర్ల: పల్లిగండ్రేడులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు సన్యాసినాయుడు, బంగారునాయుడు


గంట్యాడ: మదనాపురం సభలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి


దత్తిరాజేరు: కె. కొత్తవలసలో మాట్లాడుతున్న ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు


లక్కవరపుకోట : కిత్తన్నపేటలో పార్టీ జెండా ఆవిష్కరించిన ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు


కొత్తవలస : మంగళపాలెంలో జెడ్పీటీసీ సభ్యురాలు నెక్కల శ్రీదేవి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ

ఇంతవరకు ఏ ముఖ్యమంత్రీ అందించని సంక్షేమాన్ని జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందించారు. గత పాలకులు పెద్దలు, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేదల పక్షాన నిలబడ్డాడు. గత ప్రభుత్వాల పాలనకు.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడాను ప్రజలకు వివరించడంతో పాటు రానున్న రోజుల్లో సంక్షేమ పాలన కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి అవసరం రాష్ట్రానికి ఎంత ఉందో చెప్పేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు నిర్వహించి, జగన్ మోహన్ రెడ్డికి మద్దతు తెలపాలని కోరారు.

– గజపతినగరం/చీపురుపల్లి/ఎస్.కోట నెట్‌వర్క్


వేపాడ: నల్లబిల్లిలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించిన ఎంపీపీ సత్యవంతుడు, తదితరులు

సంక్షిప్తంగా...

పలు గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు

వేపాడ: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి యశ్వంతరావు, ఏఎస్‌ఓ పైడిరాజు నేతృత్వంలో నల్లబిల్లిలో కొట్యాడ పోతురాజు పొలంలో 5/5 విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేపట్టగా.. 12.50 కిలోల దిగుబడి వచ్చింది. అలాగే వావిలపాడు గ్రామంలో బూడి వెంకటరావు పొలంలో ప్రయోగం నిర్వహించగా.. 16.50 కిలోల దిగుబడి వచ్చింది ఏఓ తెలిపారు. ఈ ఏడాది వరి పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని వ్యవసయాధికారులు చెప్పారు.

నేడు, రేపు ఓటర్ల నమోదు ప్రక్రియ

గంట్యాడ: మండల పరిధిలో ఉన్న 63 పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో ఓటర్ల నమోదు, తొలిగింపులు, మార్పులు - చేర్పులకు సంబంధించి ప్రత్యేక కాంపైయిన్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పి. నీలకంఠేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

హిందూ ధర్మాన్ని కాపాడుకుందాం..

గజపతినగరం: హిందూ ధర్మంతో పాటు భారతదేశ సంప్రదాయాలను ప్రతిఒక్కరూ కాపాడుకోవాల్సిన అవసరం చాలా ఉందని విజయనరగరం జిల్లా సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ జాగారపు కృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆయన హిందూధర్మ ప్రచార కార్యక్రమంలో పాల్గొని విలేకరులతో మాట్లాడారు. భారతదేశంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హిందూ ధర్మం, సంప్రదాయ వస్త్రధారణ, కళాపోషణ ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేవన్నారు. కార్యక్రమంలో జోనల్ ధర్మప్రచారక్ ఆదారి గంగాధర్, ప్రచారకులు పోతన గున్నయ్య, వర్మ, తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి : ఆర్‌జేడీ జ్యోతికుమారి

వేపాడ: నాణ్యమైన బోధనతో 2023–24 విద్యా సంవత్సరంలో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆర్‌జేడీ ఎం. జ్యోతికుమారి అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కస్తూరిబా గాంధీ పాఠశాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల వర్కుబుక్స్‌తో పాటు టీచర్ల లెస్సన్ ప్లాన్స్ పరిశీలించారు. అలాగే విద్యార్థులకు అందించిన బైజూస్ ట్యాబ్‌ల వినియోగంపై ఆరా తీశారు. అనంతరం పది, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడుతూ, ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారు..మీరెలా చదువుతున్నారని ప్రశ్నించి, సమాధానాలు రాబట్టారు. కార్యక్రమంలో ఎంఈఓలు జగదీష్, బాలభాస్కరరావు, ఆయా పాఠశాల ప్రిన్సిపాళ్లు ఈశ్వరరావు, కిరణ్మయి పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రధాని మోదీ కృషి

• ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి దొడ్డి సూర్యారావు


ఎస్.కోటలో భారత్ వికసితయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట: ప్రధానమంత్రి మోదీ పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నారని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి దొడ్డి సూర్యారావు అన్నారు. ఎస్.కోటతో పాటు మండలంలోని వేములాపల్లిలో భారత వికసిత్‌యాత్ర శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించేందుకు ఈ యాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. స్థానిక బీజేపీ నాయకుడు డి.సూర్యారావు మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన, గరీబీ కల్యాణ్ అన్నయోజన, ఉజ్వల యోజన, గ్రామీణ సడక్ యోజన, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన వంటి గొప్ప పథకాలు అమలు చేస్తూ దేశాభివృద్ధికి బాటలు వేశారన్నారు. అంతకు ముందు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు డి.సంతోషి కుమారి, లగుడు సూర్యనారాయణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ లోక్‌నాథ్, నియోజకవర్గ కన్వీనర్ ఎలమంచిలి ప్రసాద్, డి.దాశరథి, శ్రీనివాసరావు, కె.సాంబశివ, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి

• ఎంపీపీ చల్లా చలంనాయుడు


బొండపల్లి: గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ చలంనాయుడు

బొండపల్లి: జనవరి నెలాఖరు నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి సామూహిక గృహప్రవేశాలకు లబ్ధిదారులను సిద్ధం చేయాలని ఎంపీపీ చల్లా చలంనాయడు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారి ఎస్‌వీకే దుర్గాప్రసాద్ అధ్యక్షతన మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో పాటు ఇంజినీరింగ్ సహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 2,079 ఇళ్లు మంజూరు కాగా అందులో 1242 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయని..మరికొన్ని వివిధ దశల్లో ఉండగా, 565 ఇళ్లు ఇంకా ప్రారంభం కాలేదని చెప్పారు. ఈ నెల 4,5 తేదీల్లో ప్రతి సచివాలయం పరిధిలో పనులు ప్రారంభించని లబ్ధిదారులతో అవగాహన సదస్సులు నిర్వహించి, పనులు ప్రారంభమయ్యేలా చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ జీవీ రంగారావు, తహసీల్దార్ డీజీ ఎంఎస్ ప్రసాదరావు, ఎంపీడీఓ వైవీ రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన నిర్మాణాలు..

మెరకముడిదాం: మండలంలో నిర్మాణాల్లో ఉన్న జగనన్న ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీధర్‌రాజా గృహనిర్మాణశాఖ ఏఈ ఎంపీ రమణకు, సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.రత్నం ఆధ్వర్యంలో మండలానికి చెందిన అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో వివిధ దశల్లో ఉన్న 247 ఇళ్లు వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండలానికి చెందిన పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వేగవంతం..

వేపాడ: మండలంలో వివిధ దశల్లో ఉన్న గృహాలను త్వరగతిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించి, పలు సూచలను చేశారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ డీఈ శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ కూర్మనాథపట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు

• ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న రహదారులన్నీ పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకూ రహదారి సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రహదారి సమస్య ఉందని చెప్పిన వెంటనే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలందరి తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. దత్తిరాజేరు నుంచి గదబవలస రోడ్డుకు రూ. 2.2 కోట్లు.. పి.లింగాలవలస నుంచి వీరసాగరం మీదుగా బొబ్బిలి హద్దు వరకు తారు రోడ్డు నిర్మాణానికి కోటి రూపాయలు.. గజపతినగరం మండలంలో ఎం.గుమడాం తారు రోడ్డుకు రూ.80 లక్షలు.. బొండపల్లి మండలం జె.గుమడాం రహదారికి కోటి రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నియోజకవర్గంలోని పాచిలవలస, ఒంపిల్లి, కొటారుబిల్లి, మోకాలపాడు, అట్టాడ, తదితర గ్రామాల్లో పాడైన రహదారులకు కూడా రూ. 7 కోట్లతో మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, మధుపాడ సర్పంచ్ కడుపుట్ల పైడపునాయుడు, మండల లక్ష్మునాయుడు, ఎం.తాతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్వరాజ్యం కల సాకారం..

• ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


సచివాలయ భవనం శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

లక్కవరపుకోట: బాపూజీ కలలు గన్న గ్రామస్వరాజ్యం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సాకారమైందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కళ్లేపల్లిలో సుమారు రూ. 71 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా, వెల్‌నెస్ భవనాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశాభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని అటువంటి గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలని గాంధీజీ కోరుకునేవారన్నారు. ఎంతమంది పాలకులు వచ్చినా అభివృద్ధికి నోచుకోని గ్రామాలు జగనన్న పాలనలో పూర్తిగా అభివృద్ధి చెందాయని చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని పనులు గ్రామాల్లోనే చేసుకునేలా వలంటీర్, సచివాలయ వ్యవస్థలు తీసుకురావడంతో పాటు రైతులకు ఉపయోగపడేందుకు రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు సదుపాయం కల్పించడంతో పాటు కోట్లాది రూపాయలతో ప్రభుత్వ భవనాలు నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తూర్పాటి వరలక్ష్మి, సర్పంచ్ గోకేడ ముసలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు తూర్పాటి అప్పలరాజు, సింహాద్రప్పుడు, పినిశెట్టి కిష్టప్పదొర, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్ఐవీ లేని సమాజమే లక్ష్యం

హెచ్ఐవీ లేని సమాజ నిర్మాణమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా వాడవాడలా శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. హెచ్ఐవీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

– గజపతినగరం/చీపురుపల్లి/ఎస్.కోట నెట్‌వర్క్


చీపురుపల్లి: ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ కేఆర్‌డీ ప్రసాద్


బొండపల్లి: గొట్లాంలో అవగాహన ర్యాలీ



కొత్తవలస: కొత్తవలస పీహెచ్‌సీ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి విజయచంద్ర, .పలువురు న్యాయవాదులు



లక్కవరపుకోట: వియ్యంపేట పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు గోపాలకృష్ణ, తదితరులు


వేపాడ: వల్లంపూడి బజారుసెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన కళాశాల విద్యార్థులు


గజపతినగరం : ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ రావాడ సత్యనారాయణ, విద్యార్థులు


జామి: మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ


ఎస్.కోట: ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

క్రీడా ప్రతిభను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'


కరపత్రాలు విడుదల చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు. ఈ నెల 15 నుంచి జరగనున్న ఆడుదాం అంధ్రా రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆసక్తి ఉన్న యువత గ్రామ సచివాలయాలతో పాటు ఆన్‌లైన్ నంబర్ 1902 ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, రఘుమండ త్రినాథ, ముల్లు పైడిరాజు, కోరుకొండ దాలయ్య, గిరడ రాందాసు, ముజీకీర్ మహ్మద్ పాల్గొన్నారు.

ముషిడిపల్లిలో 'గడప గడపకు..'


మహిళకు బ్రోచర్ ఇచ్చి పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: పేదరికంలో మగ్గుతున్న ప్రతి కుటుంబాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నదే జగన్ సర్కారు లక్ష్యమని.. అందుకోసం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ముషిడిపల్లి సచివాలయం పరిధిలో శుక్రవారం రాత్రి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. నాలుగున్నరేళ్ల కాలంలో ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మఒడి, చేయూత, గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యాకానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతుభరోసా, ఆరోగ్యశ్రీ, సామాజిక పెన్షన్‌లు వంటి పథకాలతో అన్నివర్గాల ప్రజలను ఆదుకుంటున్నట్లు చెప్పారు. ఇటువంటి సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వాకాడ రాంబాబు, సాంబరాజు, కె.వెంకటరావు, కె.జయశంకర్ స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.